క్లుప్తంగా

గోపాలపట్నం హైస్కూల్‌లో ఇంకుడు గుంత

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గంత ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం దీన్ని పూర్తి చేసి ప్రారంభించారు. ఇంకుడు గంతల వల్ల భూగర్భ జలాలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో బాబూరావు మాస్టారు, బేగం, నాగేంద్ర జోగి, జేడీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డుకి ఆర్థిక సాయం



హోంగార్డు నాయుడికి నగదు అందజేస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న కేపీ నాయుడుకు సహచర ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాయుడుకు వీరు అండగా నిలిచారు. వెస్ట్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు సూచనల మేరకు నగదును సమీకరించారు. గోపాలపట్నం ఎస్‌ఐ విజయ్‌కుమార్, పెందుర్తి ఎస్‌ఐ నర్సింగరాజు సిబ్బంది తమ సహకారాన్ని అందించారు. గోపాలపట్నం ఎస్‌ఐ విజయ్ కుమార్ నాయుడికి రూ40,500 అందించారు. ఇందుకు సహకరించిన సహచర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాయి మందిరంలో పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద గల మహత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో కొలువుదీరిన సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. బాబాకు ఉదయం 6 గంటలకు హారతి ఇచ్చారు. 8 గంటలకు విభూది, పంచామృతాలతో అభిషేకాలను జరిపి, పట్టు, వెండి ఆభరణాలను అలంకరించారు. మహిళలు బాబా కీర్తనలు ఆలపించారు

రహదారి పనులకు శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సాయి గణేష్‌నగర్‌లో రహదారులు, కాలువల అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ మాట్లాడుతూ రూ. 66.90లక్షలు జీవీఎంసీ నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్, జోనల్ కమిషనర్ హేమావతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక న్యాయవాదుల సంఘం ఎన్నికలు నేడు

గాజువాక : గాజువాక న్యాయవాదుల సంఘం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2025-26 సంవత్సరానికి గాను అధ్యక్ష కార్యదర్శులు, సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం శుక్రవారం ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. దీని కోసం రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదేరోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు గురువారం విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



వేసవి ప్రారంభంలోనే తాగునీటికి కష్టాలు ప్రారంభమయ్యాయి. గుక్కెడు నీటి కోసం నానా హైరాన పడాల్సిన పరిస్థితులున్నాయి. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు కలుషితం కావడంతో వినియోగించడానికి వీలు లేకుండా ఉంది. మురుగునీరు, నురగ వస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రామకృష్ణపురం **వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

ప్రజల ఘోష



నురగతో నీరు

ఆర్‌కేపురంలో మురుగు నీరు సరఫరా • ఇబ్బంది పడుతున్న స్థానికులు • ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ శుద్ధి చేసిన నీటిని మాత్రమే కుళాయిల ద్వారా సరఫరా చేస్తోంది. ఆర్‌కే పురంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. మురుగునీరు, నురగ వస్తోంది. రెండు వారాల నుంచి ఇదే సమస్య. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. 61వ వార్డు మల్కాపురం సమీపాన గల రామకృష్ణపురం (ఆర్‌కేపురం) ప్రాంతంలో సుమారు 15 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ ప్రాంత నివాసాలకు బోరుబావుల నుంచి నీరు అందడం లేదు.దీంతో దాదాపు గ్రామస్తులంతా జీవీఎంసీ సరఫరా చేసే కుళాయిలపైనే ఆధారపడుతున్నారు. ఈ ప్రాంతానికి ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 8.45 గంటల వరకు నీరు సరఫరా అవుతోంది. గత రెండు వారాల నుంచి కుళాయిల నుంచి ద్వారా వచ్చే నీరు మురుగు మాదిరిగా సరఫరా అవుతోంది. నురగతో కూడిన నీరు సరఫరా అవుతుండడంతో తాగేందుకు భయపడుతున్నారు. అంతేకాకుండా నీరు కూడా దుర్వాసన వస్తోంది.

కాలువకు దగ్గరలో పైప్ లైన్

పెద్ద కాలువకు దగ్గర్లో భూగర్భ పైప్‌లైన్ ఉందని, ఆ పైప్‌లైన్ లీక్ కావడంతో కాలువలో మురుగు పైప్‌లైన్ గుండా కుళాయిల ద్వారా సరఫరా నీటిలో కలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని కారణంగానే కుళాయిల ద్వారా వచ్చే నీరు కలుషితమవుతోందని చెబుతున్నారు. గత్యంతరం లేక ఆర్వో వాటర్ ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేసుకుని ఇంటికి తెచ్చుకుంటున్నామని బాధితులు చెప్పారు. ఇప్పటికైన అధికారులు ఈ సమస్యపై స్పందించాలని వారు కోరుతున్నారు.



కుళాయి ద్వారా సరఫరా అయిన కలుషిత నీరు

రెండు వారాలుగా ఇదే పరిస్థితి



రెండు వారాల నుంచి కుళాయిల ద్వారా వస్తున్న నీరు తాగేందుకు ఉపయోగపడడం లేదు. నీరంతా బురదగా సరఫరా అవుతోంద. దుర్వాసన కూడా వస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్వో ప్లాంట్‌కు వెళ్లి నీరు కోనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి

–మజ్జి రమేష్ పాత్రుడు

పట్టించుకోని అధికారులు



రెండు వారాల నుంచి కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అవుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రోజూ డబ్బులిచ్చి నీరు కొనుగోలు చేస్తున్నాం. ఆర్థిక భారం పడుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి సమస్య తీర్చాలి.

–కాకర ప్రకాష్

చర్యలు తీసుకుంటాం

కుళాయిల ద్వారా మురుగు నీరు సరఫరా అవుతుందన్న విషయం మా దృష్టికి రాలేదు. ఆప్రాంతానికి సిబ్బందిని పంపించి సమస్య గుర్తిస్తాం. మురుగు నీరు సరఫరా అయితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలను సురక్షిత నీటి సరఫరా చేయడమే తమ కర్తవ్యం.

–నాగేశ్వరరావు, మల్కాపురం నీటి సరఫరా విభాగం ఏఈ

రేషన్ డిపోల్లో జోరుగా ఈకేవైసీ ప్రక్రియ



ఈకేవైసీ నమోదు చేస్తున్న ఉద్యోగి

విశాఖ విద్య: రేషన్ కార్డుల్లో లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియ వార్డు పరిధిలోని రేషన్ డిపోల్లో జోరుగా సాగుతోంది. ఈ పౌరసరఫరాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను చేపడుతున్నారు. గోపాలపట్నం మండలపరిధిలోని అన్ని రేషన్ డిపోల్లో ఇందుకోసమని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సర్కిల్ వన్ లక్ష్మీనగర్ 78 రేషన్ డిపోలో గురువారం డీలర్ చెవ్వేటి జీవన్ కుమార్ ఆధ్వర్యంలో ఈకేవైసీ చేపట్టారు. రేషన్ కార్డులోని పేర్లు ఉన్న అందరితో బయోమెట్రిక్ వేయించి ఈకేవైసీ చేయించారు. నెలల తరబడి ఈ పోస్‌లో వేలి ముద్రలు వేయని వారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, దీనిపై ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవటంతో, లబ్ధిదారులంతా రేషన్ షాపుల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో ఈకేవైపీ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. దీనిపై పౌర సరఫరా శాఖ అధికారులు దృష్టి సారించి, లబ్ధిదారులకు తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మే 10,11 తేదీల్లో సీపీఐ మహా సభలు

సింధియా: మే 10,11 తేదీల్లో విశాఖలో నిర్వహించే సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మల్కాపురం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలకు ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామని, ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారని తెలిపారు. మోదీ ప్రభుత్వం మతపరమైన అంశాలను ఉపయోగించి ముస్లిం, క్రైస్తవులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతోందని, ప్రభుత్వ పాలనలో మతం ఉపయోగించడం నేరమని రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికి వక్ఫ్ బోర్డుకు నూతన చట్టం తీసుకువచ్చి కలతలు సృష్టిస్తోందన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతూ ప్రజలకు అండగా సీపీఐ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బి.సత్యాందరావు, కె.సత్యాంజనేయులు, గుడాల రాంబాబు ఇతర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటం ఉధృతం

• ఏప్రిల్ 1న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా



దీక్షాశిబిరంలో పాల్గొన్న రోలింగ్ విభాగం కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరుశాతం అమ్మాలని కేంద్రం ప్రభుత్వం ముందుకు వెళుతోందని పరిరక్షణపోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ ఆవేదన వ్యక్త చేశారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరుగుతున్న దీక్షలో గురువారం రోలింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి సాధించడానికి కార్మికులు ఒకవైపు కేంద్రం కుయుక్తులతో రకరకాల ఎత్తుగడలు వేస్తుందన్నారు. ప్రధాన మంత్రి కర్మాగారాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే పనిలో ఉన్నారన్నారు. అందువల్లే పోరాటం ఉధృతం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన విశాఖ నగరంలో జీవీయంసీ ఎదురుగా గల గాంధీ బొమ్మ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ధర్నాను జయప్రదం చెయ్యాలని ఆయన కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజబాబు, దేముడు, ఆనంద్ రాంబాబు అమ్మెరు, డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య పరీక్షలు



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మల్కాపురం: హిందుస్తాన్ పెట్రోలియం (విశాఖ రిఫైనరీ) సంస్థ ఆధ్వర్యంలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులకు ఉచితంగా వైద్య,రక్త పరీక్షలను నిర్వహించారు. తమ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని ఆలోచనతో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని సంస్థ ఈడీ (వీఆర్‌ఎంపి) అభిషేక్ త్రివేది పేర్కొన్నారు. సుమారు వెయ్యి మంది కార్మికులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఉచింతంగా మందులు అందజేశారు. కార్మికుల ఆరోగ్య భద్రతే ముఖ్యమని త్రివేది అన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌ఐ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వి.రమణమూర్తి, కాంట్రాక్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో లింగేశ్వరరావుకు పతకాలు



మిక్స్‌డ్ డబుల్స్‌లో సుజాన్నేతో బంగారు పతకం గెలుపొందిన లింగేశ్వరరావు

ఉక్కునగరం: జాతీయ మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బీవీఎస్‌కే లింగేశ్వరరావు రెండు పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో గోవా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ - సన్‌రైజ్ 47వ ఇండియన్ మాస్టర్స్ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2025 పోటీలు నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 23 వరకు ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలకు చెందిన 2500 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. లింగేశ్వరరావు మిక్స్‌డ్ డబుల్స్ 55+ కేటగిరీలో సుజాన్నేతో పాల్గొని బంగారు పతకం గెలుపొందారు. అదే విధంగా 55+ మిక్స్‌డ్ మెన్ కేటగిరీలో ఏవీ రాజుతో పాల్గొని మరో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. దీంతో లింగేశ్వరరావు వరుసగా తొమ్మిదోసారి వరల్డ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయనను ఉక్కు అధికారులు, పలువురు క్రీడాకారులు, పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



మట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శ్రావణ్‌కుమార్

మద్రిపాలెం: అప్కోస్ విధానాన్ని రద్దు చేసి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం జోన్-5 పరిధిలోని 49, 50, 51, 52 వార్డులకు సంబంధించి కార్మికులను ఉద్దేశించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి సుబ్బారావు 2వ వర్ధంతి ఏప్రిల్ 1న షీలానగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. అన్ని వార్డుల ఆఫీసుల వద్ద ఉదయం కామ్రేడ్ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. ఏప్రిల్ 2న 10.30 గంటలకు రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం నుంచి బహిరంగ సభ, ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అదే రోజు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ సీఐటీయూ నాయకులు పాపారావు, దేవి, లక్ష్మి, బాలరాజు, బంగారయ్య, ధన, అప్పలరాజు, రమణ, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

బుక్ డిపోనకు చేరిన పాఠ్య పుస్తకాలు



బుక్ డిపోనకు చేరిన పాఠ్యపుస్తకాలు

గాజువాక : ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు స్థానిక బుక్ డిపోనకు గురువారం చేరాయి. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గాను గాజువాక ఆటో నగర్‌లోగల ప్రభుత్వ బుక్ డిపోకు 3,99,153 పాఠ్యపుస్తకాలు చేరాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో గల 46 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 38 లక్షలకు పైగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 3.99 లక్షల పుస్తకాలు ముద్రణా కేంద్రం నుంచి వచ్చినట్టు బుక్ డిపో అధికారులు తెలిపారు. మిగిలిన పుస్తకాలు కూడా దశలవారీగా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పోక్సోపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మూది



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కంచరపాలెం: మైనర్లు, తల్లిదండ్రులు టీచర్లు పోక్సో చట్టాలపై అవగాహన కల్గిండాలని ఏడో ఎడిషనల్ మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మూది తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం పరిధి జీవీఎంసీ రామ్మూర్తి పంతులుపేట ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి అనురాగ్ మాట్లాడుతూ నూతన చట్టాలపై ముఖ్యంగా పోక్సో వంటి వాటిపై బాలబాలికలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. తెలిసీ తెలియని వయసులో ప్రేమ, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, అందుకు గల కారణాలను న్యాయమూర్తి వివరించారు. ఎటువంటి న్యాయ సలహాలకైనా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఆరీప్పేట యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిణి మట్టా శశిప్రియాంక , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, కంచరపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎం.రజిని, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, సోషల్ వర్కర్లు సురేఖ, శారదాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబికా అమ్మవారి ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావు, ఇతర భక్తులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలోని శ్రీశ్రీ నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం వార్డులో ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమంలో ముందుగా నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఘటాలను శాస్త్రోక్తంగా అలంకరించారు. అనంతరం వార్డులోని పురవీధుల్లో మేళాతాళాలతో ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలను ఈ గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. శనివారం కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం అనుపమహోత్సవాన్ని మందుగుండు సామాగ్రి, నేల డ్యాన్సులతో భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రీ పెయిడ్ ట్యాక్సీ సర్వీసు

స్థలాన్ని పరిశీలించిన రైల్వే అధికారులు



ప్రీ పెయిడ్ ట్యాక్సీ స్థలంపై పోలీసులతో చర్చిస్తున్న రైల్వే అధికారి

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందుతున నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యాలు అదే స్థాయిలో మెరుగుపరిచేందుకు అధికారులు శ్రీకారం చుడుతున్నారు. అందులో భాగంగా రైల్వే స్టేషన్ వద్ద ప్రీ పెయిడ్ ట్యాక్సీ, ఆటో సౌకర్యం కల్పించేందు గురువారం స్థల పరిశీలన చేశారు. గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామారావు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎన్‌వీ రమణ తదితరులు స్టేషన్ పరిధిలో స్థలాన్ని నిర్ధారించారు. ప్రీ పెయిడ్ ట్యాక్సీ సర్వీసు అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

ఉత్కంఠగా ప్లాంట్ లెవల్ మాక్ డ్రిల్



స్టీల్‌ప్లాంట్ మాక్ డ్రిల్‌లో ప్రసంగిస్తున్న డీసీఎఫ్‌ఐ సురేష్



రెస్క్యూ ఆపరేషన్‌లో సీఐఎస్‌ఎఫ్ ఫైర్ సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ తార్ డిస్టిల్లేషన్ ప్లాంట్ (టీడీపీ)లో గురువారం నిర్వహించిన ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ ఉత్కంఠగా జరిగింది. ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్రిపరేషన్‌ను నిర్ధారించడంలో భాగంగా రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఎఫ్‌ఐ) వి. సురేష్ సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉదయం టీడీపీ విభాగంలో అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఫిక్స్‌డ్, మొబైల్ ఫైర్ ఫైటింగ్ ఇనస్టాల్లేషన్లు, వాటర్ కర్టెన్ సిస్టంలు, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ పరికరాలతో సీఐఎస్‌ఎఫ్ ఫైర్ వింగ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ప్రమాదంలోని బాధిత వ్యక్తులను సంఘటనా స్థలం నుంచి రక్షించారు. ఆద్యాంతం మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (సర్వీసెస్) ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

పెదగంట్యాడ: టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమెటెడ్ హైదారాబాద్ కంపెనీలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేవీఎస్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమెటెడ్ హైదారాబాద్ కంపెనీలో 170 ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. ఫిట్టర్, పెయింటర్, మెషినిస్ట్ ట్రేడులలో 18 ఏళ్ల నిండి, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు, ఎంపిక చేసిన అభ్యర్థులకు అప్రెంటిస్ చేస్తున్న సమయంలో రూ.11 వేలు స్టైఫండ్, మధ్యాహ్నం భోజనం , రవాణ ఖర్చులు అందజేస్తారని, అప్రెంటిషిప్ పూర్తి చేసిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించి రూ. 17వేలు వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు అన్ని ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 28న శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ గాజువాక కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

పోలమాంబ హుండీ ఆదాయం రూ.6.81 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం గురువారం ఈవో గాయత్రి పర్యవేక్షణలో నిర్వహించారు. రెండు నెలలకు గానూ దేవస్థానానికి హుండీల ద్వారా రూ.6,81,853 నగదు, 140 గ్రాముల బంగారం, 2.25 కేజీల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు తవిటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.